

డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 2,800, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.



సర్కారీ బడులు.. డిజిటల్ చదువులు

ప్రభుత్వ పాఠశాలల్లో బోధన పద్ధతుల్లో సరికొత్త మార్పులు వస్తున్నాయి. ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ద్వారా బోధన చేపట్టనున్నారు. దీనిపై టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36.5° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	36.5	26.0
కాకినాడ	33.7	26.6
అమలాపురం	32.0	27.0

న్యూస్‌రీల్

ఓఎన్‌జీసీ స్టడీ టూర్‌లో ఎంపీ అనురాధ



మధురైలో జరిగిన స్టడీ టూర్‌లో పాల్గొన్న ఎంపీ అనురాధ

అల్లవరం: తమిళనాడులోని మధురైలో జరుగుతున్న ఓఎన్‌జీసీ స్టడీ టూర్‌లో ఎంపీ, కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు చింతా అనురాధ సోమవారం పాల్గొన్నారు. శనివారం ఆమె బెంగళూరులో జరిగిన స్టడీ టూర్‌లో పాల్గొన్నారు. ఈ నెల 12వ వరకు ఓఎన్‌జీసీ నిర్వహించే స్టడీ టూర్‌లో పాల్గొంటున్నాని ఎంపీ అనురాధ తెలిపారు.

14న యువ ఉత్సవ్

అమలాపురం టౌన్: భారత ప్రభుత్వ సంస్థ నెహ్రూ యువ కేంద్రం, నవ భారత్ యువ నిర్మాణ సంఘ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 14వ తేదీన జిల్లా స్థాయి యువ ఉత్సవ్–2023, ఇండియా ఫర్ 2047 కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి పి.అమృతేష్ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా యువతీ యువకులకు 'పంచ ప్రాణ్ ఆఫ్ అమృత్ కాల్' అనే అంశంపై డిక్లమేషన్, యంగ్ రైటర్, ఫొటోగ్రఫీ, పోయిట్రీ, సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. మొదటి మూడు స్థానాల్లో విజయం సాధించిన విజేతలకు ప్రభుత్వం ద్వారా నగదు ప్రోత్సాహకాలు, ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని తెలిపారు. వివరాలకు 85006 47380 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని అమృతేష్ సూచించారు.

14న మెగా జాబ్ మేళా

అమలాపురం రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 14న అమలాపురం మిరియాం డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేళా వాల్ పోస్టర్లను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణలు ఎక్కువగా నిర్వహించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించాలని కలెక్టర్ శుక్లా సూచించారు. 14న నిర్వహించే మెగా జాబ్ మేళాలో 14 కంపెనీలు సుమారు 1,000 ఉద్యోగాలు భర్తీ చేయనున్నాయని తెలిపారు. ఈ మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువ త నూరు శాతం సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ అవకాశం ఆధారంగా మరిన్ని శిక్షణలు పొందుతూ మంచి ఉద్యోగాలు సాధించాలని అభిలషించారు. మెగా జాబ్ మేళాకు సంబంధించి సందేహాల నివృత్తికి, సూచనలు, సలహాల కోసం నైపుణ్యాభివృద్ధి సంస్థను 96031 61039, 93 8080 8275 నంబర్లలో సంప్రదించాలి. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, జిల్లా ఉపాధి కల్పనా అధికారి వసంతలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకమాన్ తదితరులు పాల్గొన్నారు.

లోవకు హుండీల ద్వారా రూ.29 లక్షల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానానికి హుండీల ద్వారా రూ.29,04,892 ఆదాయం వచ్చినట్టు ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు సోమవారం తెలిపారు. పెద్దాపురం దేవదాయ, ధర్మదాయ తనిఖీ అధికారి సీహెచ్ ఉదయబాబు నాయుడు పర్యవేక్షణలో ఆలయ హుండీలను సోమవారం తెరచి ఆదాయం లెక్కించారు. 21 రోజులకు నాణేల రూపంలో రూ.80,473, నోట్లు రూ.28,24,419 వెరసి మొత్తం రూ.29,04,892 ఆదాయం వచ్చిందని వివరించారు. ఆలయ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తలు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

రత్నగిరిపై నిజాయితీ చాటిన చక్రమ్మ

అన్నవరం: రత్నగిరిపై ప్రకాష్ సదన్ సత్రంలో బస చేసిన భక్తులు 204వ నంబర్ రూమ్‌లో రూ.లక్ష విలువ చేసే బంగారు ఉంగరాలు మర్చిపోయి వెళ్లిపోయారు. ఆ గదిని శుభ్రం చేస్తున్న కేఎల్‌టీఎస్ సిబ్బంది ఐనా చక్రమ్మకు ఆ మూడు ఉంగరాలు దొరికాయి. ఆమె వెంటనే వాటిని ఆ సత్రం గుమస్తాకు అందజేసింది. ఆ గుమస్తా రికార్డులో ఉన్న అడ్రస్ ప్రకారం ఆ భక్తులకు ఫోన్ చేసి వెనక్కి రప్పించి, చక్రమ్మ ద్వారా వారికి ఆ బంగారు ఉంగరాలు అందజేశారు. మూడు ఉంగరాల విలువ రూ.లక్ష ఉంటుందని అధికారులు తెలిపారు. నిజాయితీ చాటుకున్న చక్రమ్మను భక్తులతో పాటు దేవస్థానం సిబ్బంది అభినందించారు.

కూ.. చకచకా..

- వేగం అందుకోనున్న కోనసీమ రైల్వే లైన్ నిర్మాణం
- రాష్ట్ర వాటాకు బదులు భూ సేకరణ వ్యయం భరించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- తాజా ఒప్పందంతో ముందుకు కదలనున్న పనులు
- ఇప్పటికే జోరుగా సాగుతున్న వంతెనల నిర్మాణాలు



కోనసీమ రైల్వే లైను వంతెనకు గౌతమీ గోదావరిపై కోటిపల్లి వద్ద నిర్మించిన పిల్లర్లు

అమలాపురం టౌన్: కోనసీమ ప్రజల చిరకాల స్వప్నాన్ని వీలైనంత త్వరగా సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సరికొత్త ఒప్పందం కుదిరింది. దీంతో ఈ పనులు వేగం అందుకునేందుకు మార్గం సుగమమైంది.

2000 సంవత్సరంలో పునాది

కోనసీమ రైల్వే లైను ప్రాజెక్టు నిర్మాణానికి 2000 సంవత్సరంలో పునాది రాయి పడింది. నాటి ఎన్‌డీఏ ప్రభుత్వంలో రైల్వే మంత్రి మమతా బెనర్జీ ఈ ప్రాజెక్టుకు అమలాపురంలో శంకుస్థాపన చేశారు. అప్పట్లో ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం కేవలం రూ.650 కోట్లు. శంకుస్థాపన చేశారే తప్ప ఈ ప్రాజెక్టు నిర్మాణంపై నాటి కేంద్ర ప్రభుత్వం, అప్పట్లో రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు నాయుడి ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. తదనంతరం 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రైల్వే లైను కోసం ఇక్కడి ప్రజలు పడుతున్న ఆరాటాన్ని అర్థం చేసుకున్నారు. దీంతో ఈ రైల్వే లైను వెంటనే నిర్మించేందుకు వీలుగా ఆయన ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేలా కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారు. దీంతో భూసేకరణ ఊపందుకుని, ఈ రైల్వే లైను నిర్మాణానికి మార్గం సుగమమైంది.

జాప్యం.. పెరిగిన అంచనా వ్యయం

నాటి వైఎస్సార్ ప్రభుత్వం ఇంతగా ముందుకు వచ్చినప్పటికీ నాటి కేంద్ర ప్రభుత్వం దీనిపై పెద్దగా స్పందించలేదు. ఫలితంగా అంచనా వ్యయం నాలు గింతలు పైగా పెరిగింది. కేంద్రంలోని ప్రభుత్వాలు 2000 నుంచి 2012 వరకూ రైల్వే బడ్జెట్లలో ఈ ప్రాజెక్టుకు అరకొరగా రూ.70 కోట్లు మాత్రమే విడుదల చేశాయి. 2009లో వైఎస్సార్ హఠాన్మరణం చెందిన తరువాత రాష్ట్రంలో వచ్చిన ప్రభుత్వాలు కూడా దీనిపై శ్రద్ధ చూపలేదు. 2012 నుంచి 2016 వరకూ అరకొర కేటాయింపులతో కోనసీమ రైల్వే లైను నిర్మాణంలో ఎడతెగని జాప్యం జరిగింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2012 నాటికి రూ.1,065 కోట్లకు పెరిగింది. 2016–17లో రూ.150 కోట్లు మాత్రం కేటాయించారు. ఇది ఏమూలలకూ చాలని పరిస్థితి. అదే సమయంలో అంచనా వ్యయం రూ.2,120 కోట్లకు పెరిగింది. 2017–18లో రూ.230 కోట్లు, 2018–19లో రూ.400 కోట్లు, 2019–20లో రూ.200 కోట్లు, 2020–21లో రూ.530 కోట్లు, 2021–22లో రూ.187 కోట్ల చొప్పున కేటాయించారు. ఇప్పటి వరకూ పలు బడ్జెట్‌ల్లో రూ.1,700 కోట్లకు పైగా కేటాయిస్తే ఇప్పటి వరకూ విడుదలైంది రూ.1,200 కోట్లు మాత్రమే కావడం గమనార్హం.

కొత్త ఒప్పందం ఇదీ..

అంచనా వ్యయం తక్కువగా ఉన్నప్పుడు ప్రాజెక్టు వ్యయంలో 25 శాతం భరించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. అప్పట్లో కేంద్రం సక్రమంగా స్పందించి ఉంటే ఈ రైల్వే లైను నిర్మాణం తక్కువ వ్యయంతోనే పూర్తయి ఉండేది. కేంద్ర ప్రభుత్వం రెండు దశాబ్దాలకు పైగా చేసిన జాప్యంతో ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం ప్రస్తుతం రూ.2,892 కోట్లకు పెరిగింది. ఇంత పెద్ద మొత్తంలో 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించడమంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో భారమే అవుతుంది. ఈ నేపథ్యంలో 25 శాతం కాకుండా ఈ ప్రాజెక్టు భూసేకరణ భారాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలోని గౌతమి, వైనతేయ, వశిష్ట గోదావరి పాయలపై మూడు రైల్వే వంతెనలు నిర్మిస్తున్నారు. ఈ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. దీంతో పాటు మొత్తం 57 కిలోమీటర్ల పొడవున రైల్వే ట్రాక్ నిర్మించాల్సి ఉంది. ఈ ట్రాక్, వంతెనలు, స్టేషన్ల నిర్మాణానికి మొత్తం 911 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. ఇప్పటి వరకూ 403 ఎకరాల సేకరణ పూర్తయింది. మరో 508 ఎకరాలు సేకరించాల్సి ఉంది. తాజా ఒప్పందం మేరకు రాష్ట్ర వాటా నిధుల ప్రసక్తి లేకుండా ఇక నుంచి భూసేకరణ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. దీంతో కోనసీమ ప్రగతిలో భాగమైన ఈ రైల్వే లైను పనులు ఊపందుకోనున్నాయి.

మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది



కోనసీమ రైల్వే ప్రాజెక్టు పనులను ముందుకు నడిపేందుకు మా ప్రభుత్వం తొలి నుంచీ చిత్తశుద్ధితోనే ఉంది. ఈ లైను నిర్మాణానికి నాతో పాటు ఎంపీ అనురాధ, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు అవసరమైన సహకారం అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 25 శాతం వాటా నిధుల స్థానే భూసేకరణ అంతా మేమే చూసుకుంటాం కాబట్టి ఇక ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగే వెసులుబాటు కలిగింది. రైల్వే లైన్ నిర్మాణంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తరచూ ఆరా తీస్తున్నారు.

– పినిపే విశ్వరూప్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

త్వరితగతిన పూర్తి చేస్తాం



కోనసీమలో రైల్వే లైను నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం. నేను ఎంపీ అయినప్పటి నుంచీ ఇప్పటికే జరిగిన జాప్యాన్ని నివారించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాను. బడ్జెట్లలో కేటాయింపులపై ఒత్తిడి తెస్తూనే నిధులు సాధిస్తున్నాను. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటాకు బదులు భూసేకరణ బాధ్యత తీసుకోవడం కూడా మంచి పరిణామం. ఈ కొత్త ఒప్పందంతో ఈ రైల్వే లైను నిర్మాణం వేగంగా పూర్తవుతుంది. సీఎం జగన్ కూడా కోనసీమ రైల్వే ప్రాజెక్టును తొందరగా పూర్తి చేసే విషయంలో చిత్తశుద్ధితో ఉన్నారు. – చింతా అనురాధ, ఎంపీ, అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



కోనసీమ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయం అందరూ స్వాగతించేలా ఉంది. ఈ రైల్వే లైన్ పనులు మరింత వేగవంతమై, పచ్చని కోనసీమ నుంచి రైలు బండి వెళ్లేలా పచ్చ జెండా ఊపాలన్నదే ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ.

– బందారు రామమోహనరావు, కన్వీనర్, కోనసీమ జేఏసీ, అమలాపురం

మంచి పరిణామం



కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులకు బదులు భూ సేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటుందన్న నిర్ణయం మంచి పరిణామం. మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, కోనసీమ ఎమ్మెల్యేల కృషి ఫలించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్ల కాలంలోనే ఈ ప్రాజెక్ట్‌కు రైల్వే బడ్జెట్లలో ఎక్కువ నిధుల వచ్చాయి. ఇందుకు ఎంపీ అనురాధ కేంద్రంలో ఎంతో కృషి చేశారు.

– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ, కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధి, అమలాపురం

పిల్లలు బడి బయట లేకుండా చర్యలు

- ప్రతి ఒక్కరూ కనీసం డిగ్రీ వరకూ చదవాలి
- అదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: పిల్లలెవ్వరూ బడి బయట లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. వివిధ కార్యక్రమాల పురోగతిపై ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో సోమవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం డిగ్రీ వరకూ చదవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఈ మేరకు బడి బయట పిల్లలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పదో తరగతి పాసయిన పిల్లలు ఇంటర్ లేదా ఇతర తరగతుల్లో చేరారో లేదో తెలుసుకునేందుకు ప్రభుత్వం వలంటీర్ల ద్వారా సర్వే చేపట్టిందని తెలిపారు. దీని ద్వారా వలస వెళ్లిన, చనిపోయిన వారు మినహా మిగిలిన వారు ఏదో ఒక పాఠశాలల్లో ఉండేలా పక్కా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి పెరిగేలా చూడాలని విద్యా శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మన బడి నాడు – నేడు కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, నిర్దేశిత తొమ్మిది అంశాల ద్వారా వసతులను మెరుగుపరచాలన్నారు. పాఠశాలల, మరుగుదొడ్ల నిర్వహణ గ్రాంట్లను సక్రమంగా వినియోగించి, పరిశుభ్రతకు నిలయాలుగా తీర్చిదిద్దాలని సూచించారు.

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష రీసర్వేలో నిర్దేశిత ఐదు పారామీటర్లలో సమాంతరంగా పురోగతి సాధిస్తూ నిర్దేశిత కాలవ్యవధిలో లక్ష్యాలు చేరుకోవాలని తహసీల్దార్లను కలెక్టర్ శుక్లా ఆదేశించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పనులకు సంబంధించి పూర్తి చేసిన వాటికి జీజీఎంపీ ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో 55 వేల కౌలు రైతులకు పంట రుణ అర్హత కార్డులు మంజూరు చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 45 వేలు మాత్రమే జారీ చేశారని, రైతుభరోసా కేంద్రాల సహకారంతో మిగిలిన 10 వేల మందిని గుర్తించి, కార్డులు అందజేయాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ, ఎన్నికల జాబితా అంశాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకాన్ని స్టేజ్ కన్వర్షన్ ద్వారా వేగవంతం చేసి పేదల సొంతింటి కలను సాకారం చేయాలని అన్నారు.

స్పందనకు 244 అర్జీలు



స్పందనలో అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: కలెక్టరేట్ స్పందన హాలులో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి 244 అర్జీలు అందాయి. జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అర్జీలు స్వీకరించారు. సామాజిక భద్రతా పింఛన్లు, రెవెన్యూ, భూ సమస్యలు, వివిధ ప్రభుత్వ పథకాల మంజూరు కోరుతూ ప్రజలు అర్జీలు సమర్పించారు. వీటిపై సత్వరమే స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి ప్రత్యామ్నాయంగా జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని, వీటి ద్వారా కూడా ప్రజా సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారాలు సులభంగా లభిస్తున్నాయని అన్నారు. డివిజన్, మండల స్థాయిలో వచ్చిన అర్జీలకు అక్కడికక్కడే, జిల్లా స్థాయి సమస్యలపై సంబంధిత జిల్లా అధికారులు పరిష్కారం చూపాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ శుక్లా ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 37 అర్జీలు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 37 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వ్యక్తిగతంగా ఫిర్యాదులు చేసి, తమ సమస్యలు ఏకరువు పెట్టారు. ఎక్కువగా ఆస్తి, కుటుంబ తగాదాలపై అర్జీలు వచ్చాయి. కొంత మంది కుటుంబ సభ్యులతో కలసి వచ్చి మరీ ఫిర్యాదులు చేశారు. వీటిలో కొన్నింటిని ఎస్పీ శ్రీధర్ అక్కడికక్కడే పరిష్కరిస్తూ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీకుమార్, డీసీఆర్‌బీ ఎస్సై గంగాభవాని పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీధర్

అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహ జ్వాల

- పలు ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనాలు
- వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్



అమలాపురంలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



రాయవరం మండలం పసలపూడిలో పవన్ దిష్టిబొమ్మ దహనం

అమలాపురం టౌన్/మామిడికుదురు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా.. సేవా సారథులుగా నిలుస్తున్న గ్రామ/వార్డు వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహ జ్వాలలు రేగాయి. ఆయన దిష్టిబొమ్మను పలు ప్రాంతాల్లో వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం దహనం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్న వలంటీర్లకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమలాపురం సూర్య నగర్ వార్డు సచివాలయం ఎదుట వలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన తెలిపారు. పవన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణ్, కౌన్సిలర్ కట్టోజు సన్న్యయ్యదాసులు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కరోనాతో పాటు సాధారణ సమయంలో కూడా ప్రజలకు వలంటీర్లు అందించిన, అందిస్తున్న సేవలకు అందరూ వందనం చెబుతూంటే అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం పవన్ కల్యాణ్ మూర్ఖత్వానికి నిదర్శమని విమర్శించారు. మామిడికుదురు మండలం నగరం గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఎదుట 216వ నంబర్ జాతీయ రహదారిపై పవన్ కల్యాణ్ ఫొటోలు ప్రదర్శిస్తూ వలంటీర్లు నిరసన తెలిపారు. అనంతరం పవన్ దిష్టిబొమ్మను, ఫొటోలను దహనం చేశారు. తమపై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మానవతా దృక్పథంతో, గౌరవ వేతనంతో పని చేస్తున్న తమను కించపరిచే విధంగా మాట్లాడటం పవన్‌కు తగదన్నారు. కొందరు మహిళలు కూడా తమ పిల్లలతో ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ నిరసనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీగా స్తంభించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పార్టీ నేతలు కూడా పాల్గొన్నారు. వలంటీర్లను అవమానించేలా మాట్లాడిన పవన్ కల్యాణ్ వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇంకా ముమ్మిడివరం, ఉప్పలగుప్తం, అంబాజీపేట, అయినవిల్లి, మలికిపురం, రాయవరం, కాజులూరు తదితర మండలాల్లో కూడా పవన్ దిష్టిబొమ్మలను వలంటీర్లు దహనం చేశారు.

ప్రభంజనం..

- 2011 లెక్కల ప్రకారం జిల్లా జనాభా 17.19 లక్షలు
- కరోనాతో నిలిచిన 2021 జనగణన
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



రాయవరం: జనం..జనం.. ఎక్కడ చూసినా ప్రభం 'జనమే'. ఏటా జనాభా పెరుగుతూనే ఉంది. అందుకు అనుగుణంగా ప్రజల అవసరాలూ పెరుగుతున్నాయి. వీటిని తీర్చడంతో పాటు జనాభా నియంత్రణకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇది ఆశించిన ఫలితాలను ఇస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతుల మెరుగుపరచడం, గర్భిణులపై ఆశా కార్యకర్తల ప్రత్యేక పర్యవేక్షణ, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం వంటి వినూత్న కార్యక్రమాలతో ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఫలితంగా మాతా, శిశు మరణాల రేటు చాలా వరకూ తగ్గడంతో పాటు జననాల రేటు పెరుగుతోంది. ఇదే సమయంలో కుటుంబ నియంత్రణపై జనంలో అవగాహన కూడా పెరుగుతోంది. చాలా మంది ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలు చాలనుకుంటున్నారు. పిల్లలకు మంచి భవిష్యత్ కల్పించడానికి ఒకరిద్దరితోనే సరిపుచ్చుకుంటూ చింతలేని చిన్న కుటుంబమే మేలనే అవగాహనకు వస్తున్నారు. నేడు ప్రపంచ జనాభా దినోత్సవం. ఈ సందర్భంగా అధికార యంత్రాంగం వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

జనాభా దినోత్సవం ఎందుకంటే..

జనాభా దినోత్సవాన్ని 1987 జూలై 11 నుంచి ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఆ రోజున జన్మించిన ఒక శిశువుతో ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరింది. దీంతో జనాభా నియంత్రణ అవసరమని అంతర్జాతీయంగా భావించారు. ప్రపంచ జనాభాలో చైనా మొదటి స్థానంలో ఉండగా, మన దేశం రెండో స్థానంలో ఉంది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన దేశ జనాభా 36 కోట్లు మాత్రమే. కాగా నేడు 140 కోట్లు పైబడి ఉంది.

జనగణన ఎందుకు చేపట్టాలంటే..

సాధారణంగా ప్రతి పదేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక జనగణన చేపడుతుంది. దీని వలన దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంత జనాభా ఏ మేరకు ఉంది, ఎంత శాతం పెరిగింది తదితర విషయాలు స్పష్టమవుతాయి. అలాగే గ్రామాలు, పట్టణాల్లోని కుటీర పరిశ్రమలు, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్, వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, వ్యవసాయ కూలీలు, పరిశ్రమల్లో పని చేస్తున్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంఖ్య తెలుస్తుంది. అలాగే 18 సంవత్సరాల్లోపు పిల్లలు, 18 – 25 మధ్య ఉండే యువత తదితర అన్ని విషయాలూ జనగణన ద్వారా తెలుస్తాయి. జనాభా ఎంత వేగంగా పెరుగుతోందనే విషయం కూడా స్పష్టమవుతుంది. పెరుగుతున్న జనాభాకు తగిన ఉద్యోగాలు, ఆవాసం, ఇతర సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. రాష్ట్రాల జనాభా ఆధారంగానే విద్య, వైద్యం తదితర ప్రాధాన్య రంగాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. జనాభాకు తగినన్ని వనరులున్న ప్రాంతాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయి. జనాభా లెక్కకు మిక్కిలిగా పెరిగిపోతే వనరుల కల్పన కష్టతరమవుతుంది. ఈ నేపథ్యంలోనే జనాభా నియంత్రణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.

కరోనాతో నిలిచిన జనగణన

ప్రతి పదేళ్లకోసారి జనగణన చేయాల్సి ఉండగా, తాజా జనాభా లెక్కల సేకరణ 2020లో ప్రారంభమై 2021 ఫిబ్రవరి 28తో ముగియాల్సి ఉంది. అయితే కరోనా కారణంగా 2020లో జనగణన నిర్వహించలేదు. అప్పటి నుంచీ జనగణన చేపడతామని చెబుతున్నా, ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రస్తుతం డిసెంబర్ 31వ తేదీ వరకూ జనగణన ముందుకు సాగే అవకాశం లేదని సమాచారం. ఈ దశాబ్ద కాలంలో జిల్లాలో జనాభా పెరుగుదల జనగణన తర్వాత మాత్రమే స్పష్టంగా తెలుస్తుంది.

అవగాహన కల్పిస్తాం



ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాలో ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల పరిధిలో ర్యాలీలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చాం. జనాభా నియంత్రణపై ఈ నెల 24 వరకూ అవగాహన కల్పిస్తాం. పీహెచ్‌సీకి వచ్చే వారికి చిన్న కుటుంబాలు, కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది స్వాతంత్ర్య అమృత మహోత్సవం సందర్భంగా 'కుటుంబ సంతోషం, శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిద్దాం' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నాం.

– డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

2011 జనగణన ప్రకారం జిల్లా జనాభా వివరాలివీ..

మండలాలు	22
కుటుంబాలు	4,81,168
హేబిటేషన్లు	938
ఇన్ హేబిటేషన్లు	3
మొత్తం జనాభా	17,19,093
పురుషులు	8,62,030
స్త్రీలు	8,57,063
పట్టణ జనాభా	1,64,421
గ్రామీణ జనాభా	15,54,672
మొత్తం ఎస్సీ జనాభా	4,27,572
ఎస్టీ జనాభా	13,527
ఇతరులు	12,74,565
ఆరేళ్ల లోపు బాలురు	83,641
బాలికలు	80,532
అత్యధిక జనసాంద్రత (చదరపు కిలోమీటరుకు 1,758 మంది)	అమలాపురం
అత్యల్ప జనసాంద్రత (చదరపు కిలోమీటరుకు 510 మంది)	ఉప్పలగుప్తం
అక్షరాస్యులు	1,42,648
అత్యధిక అక్షరాస్యత	
అమలాపురం	(84.22 శాతం)
అత్యల్ప అక్షరాస్యత	
ఆలమూరు	(65.77 శాతం)
మెయిన్ వర్కర్లు	5,89,928
వ్యవసాయ కూలీలు	4,22,088
మార్జినల్ వర్కర్లు	1,29,515
నాన్ వర్కర్లు	10,03,293

క్లుప్తంగా

తల్లి మృతదేహానికి కుమార్తె తలకొరివి


తల్లి మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న కుమార్తె ప్రభావతి

మలికిపురం: తల్లి మృతదేహానికి కుమార్తె తలకొరివి పెట్టిన సంఘటన ఇది. మలికిపురం మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన పట్టపు నారాయణమ్మ (95) సోమవారం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. కుమారులు లేరు. దీంతో నారాయణమ్మ మృతదేహానికి ఆమె మూడో కుమార్తె నూనె ప్రభావతి తలకొరివి పెట్టింది. ఆమె మృతదేహానికి సర్పంచ్ మంద నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

పురోహితుల సరఫరా వేలం వాయిదా

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో వివాహాలకు పురోహితులను సరఫరా చేసేందుకు సోమవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలం వాయిదా పడింది. ఇందులో పాల్గొనడానికి వచ్చిన వారు వేలం నిబంధనల ప్రకారం పత్రాలు సమర్పించకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. అన్నదాన పథకం సమీపంలో జ్యూస్ సెంటర్ నిర్వహణకు వేలం నిర్వహించగా నెలకు రూ.1.90 లక్షలకు పాట ఖరారైంది. అలాగే, సీతారామ సత్రం వద్ద కాఫీ, టీ పాయింట్ నిర్వహణకు నెలకు రూ.17,700కు పాట ఖరారైంది. కాగా, దేవస్థానం కళాశాల మైదానంలో ప్రొవిజన్ స్టాల్ నిర్వహణకు నెలకు రూ.9,900కు అత్యధిక బిడ్ పడింది. కాగా బేకరీ నిర్వహణ, వ్యూ పాయింట్ వద్ద టెలిస్కోప్ ఏర్పాటు వాయిదా పడ్డాయి. వేలం పాటలను దేవస్థానం ట్రస్టీ పేరూరి బద్రి, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, ఏఈఓ జగ్గారావు, వై.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఎంవీకే సుబ్రహ్మణ్యం నిర్వహించారు.

డీసీసీబీ ఉద్యోగులకు బదిలీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో ఉద్యోగుల బదిలీలు భారీగా జరిగాయి. డీసీసీబీ పరిధిలోని 52 బ్రాంచిలతో పాటు, కేంద్ర కార్యాలయంలో ఒకే బ్రాంచిలో ఐదేళ్ల పాటు పని చేస్తున్న వారిని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ఆదేశాల మేరకు సీఈఓ ఆర్‌వీ నరసింహారావు సోమవారం బదిలీ చేశారు. ఇటీవల పదోన్నతి పొందిన వారికి సైతం బదిలీలు జరిగాయి. బ్యాంకుల్లో పని చేస్తున్న 17 మంది సీనియర్ మేనేజర్లను నోడల్ అధికారులుగా నియమించారు. 13 మంది చీఫ్ మేనేజర్లను వివిధ బ్రాంచిలకు బదిలీ చేశారు. 33 మంది మేనేజర్లు, 34 మంది అసిస్టెంట్ మేనేజర్లు, 25 మంది స్టాఫ్ అసిస్టెంట్లకు స్థానచలనం కలిగింది.

సర్కారీ బడులు.. డిజిటల్ చదువులు

- సుద్దముక్కలతో పని లేదిక.. దృశ్య, శ్రవణ బోధనకే చోటిక
- బోధనలో సరికొత్త విధానానికి శ్రీకారం
- ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు
- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీల వినియోగం
- ఐఎఫ్‌పీ బోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ


ఐఎఫ్‌పీ ఉపయోగాలపై శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు


ఐఎఫ్‌పీ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

రాయవరం: బోధన పద్ధతుల్లో, మౌలిక వసతుల్లో ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలతో పోల్చుకునేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనికి పూర్తి భిన్నమైన పరిస్థితి వచ్చింది. మన బడి నాడు – నేడు ద్వారా కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి చేశారు.

ఇప్పుడు బోధనలోనూ సాంకేతిక విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రైవేట్/కార్పొరేట్‌లో లేని విధంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) డిస్‌ప్లేలను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ఈ విధానంతో పాఠశాలల్లో బ్లాక్, గ్రీన్ బోర్డుల ద్వారా బోధనకు స్వస్తి పలుకుతారు. విద్యా వ్యవస్థలో ఇదొక విప్లవాత్మక మార్పుగా విద్యావేత్తలు పరిగణిస్తున్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ డిస్‌ప్లేలను వినియోగించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇస్తున్నారు.

నాడు – నేడు పాఠశాలల్లో..

తొలుత మన బడి నాడు – నేడు పథకం కింద అభివృద్ధి చేసిన పాఠశాలల్లో డిజిటల్ బోధనకు ప్రభుత్వం అడుగులు వేసింది. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీ డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు. ఈ సరికొత్త విధానం ద్వారా ఈ నెల 15 నుంచి బోధన సాగించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కొత్త తరహా బోధన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఐఎఫ్‌పీ అంటే..

అభివృద్ధి చెందిన దేశాల్లో ఐఎఫ్‌పీడీ ద్వారా ఇప్పటికే బోధన సాగిస్తున్నారు. ఈ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తోంది. వీటి ద్వారా ఎంత క్లిష్టమైన పాఠ్యాంశాన్నైనా విద్యార్థులకు సులువుగా బోధించవచ్చు. ఉపాధ్యాయులు గతంలో ఏదైనా కొత్త విషయాన్ని బోధించాలంటే తమ ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఆ విషయాన్ని డౌన్‌లోడ్ చేసుకుని బోధించాల్సి వచ్చేది. కానీ నూతన విధానంలో ఒకే క్లిక్‌తో ఈ ప్యానల్‌పై పాఠ్యాంశాలను బోధించే అవకాశముంటుంది. గణితం, సైన్స్, సోషల్ బోధించే సమయంలో ఆయా చిత్రాలను బోర్డుపై గీస్తూ బోధించవచ్చు. వీటిని బ్లాక్, వైట్ బోర్డులుగా ఉపయోగించవచ్చు. ఐఎఫ్‌పీలపై త్రిభుజాలు, చతుర్భుజాలు, మానవ అవయవాలు, వివిధ రకాల పటాలను, చిత్రాలను స్వయంగా గీసి చూపిస్తూ బోధించడం వలన విద్యార్థులు సులువుగా అభ్యసించే వీలవుతుంది. ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులకు వీడియోలు, ఫొటోలు చూపించవచ్చు. ఉపాధ్యాయుడు బోధించిన పాఠాన్ని సేవ్ చేసుకునే ఆప్షన్ కూడా ఉంది. పీడీఎఫ్ రూపంలో ఉపాధ్యాయుడు రాసుకున్న నోట్స్‌ను డబ్ల్యూపీఎఫ్ ద్వారా ప్రజెంటేషన్ చేయవచ్చు. నాన్ లాంగ్వేజెస్ ఉపాధ్యాయులే కాకుండా లాంగ్వేజ్ ఉపాధ్యాయులు తమ సబ్జెక్టులను బోధించుకునే అవకాశముంది. మొబైల్ ఫోన్‌తో కూడా ఐఎఫ్‌పీని ఆపరేట్ చేసుకోవచ్చు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనను ప్రధానోపాధ్యాయుడి గది నుంచి పర్యవేక్షించే వీలుంది.

బ్లాక్, గ్రీన్‌బోర్డులతో పని లేదిక

పాఠశాలల్లో ఇప్పటి వరకూ బ్లాక్, గ్రీన్‌బోర్డుల ద్వారా బోధన చేస్తున్నారు. విద్యార్థులకు ఏ పాఠం బోధించాలన్నా ఉపాధ్యాయులు కచ్చితంగా బోర్డులపై సుద్దముక్కను ఉపయోగించి రాసేవారు. డిజిటల్ విద్యా బోధనలో భాగంగా నూతన విధానం ఐఎఫ్‌పీ డిస్‌ప్లే ద్వారా బోధించే సమయంలో సుద్దముక్కలు, బ్లాక్, గ్రీన్‌బోర్డులతో పని ఉండదు. ఇప్పటికే నాడు – నేడు పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులకు స్మార్ట్ టీవీలు, 6 నుంచి 10 తరగతులకు ఐఎఫ్‌పీ డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు.

అవగాహనకు శిక్షణ తరగతులు

డిజిటల్ విద్యా విధానంలో ఐఎఫ్‌పీ డిస్‌ప్లేలు ఏ విధంగా ఉపయోగించాలనే అంశంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీలతో పాటు, స్మార్ట్ టీవీలు, బైజూస్ ట్యాబ్స్ వినియోగంపై కూడా శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు రెండు రోజుల చొప్పున జిల్లాలోని 4,174 మంది ఉపాధ్యాయులకు ఈ నెల 15 వరకూ ఈ శిక్షణ జరుగుతోంది. ఈ శిక్షణ అనంతరం ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయులకు స్మార్ట్ టీవీల వినియోగంపై శిక్షణ ఇచ్చే అవకాశముంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 142 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 951 ఐఎఫ్‌పీ డిస్‌ప్లేలు, 191 ప్రాథమిక పాఠశాలల్లో 264 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. ఆయా పాఠశాలల్లో వీటి ఇన్‌స్టలేషన్ కూడా పూర్తి చేశారు. ఇదిలా ఉండగా గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 17,039 మంది 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 14,561 మంది విద్యార్థులకు, 2,478 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేశారు. ఉపాధ్యాయుల శిక్షణ అనంతరం ఐఎఫ్‌పీల ద్వారా పూర్తి స్థాయిలో బోధన చేపట్టనున్నారు.

బోధన సులభతరమవుతుంది



డిజిటల్ విద్యా విధానంలో భాగంగా ఐఎఫ్‌పీలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. బోధన సులభతరమవ్వడమే కాకుండా, విద్యార్థులు నేర్చుకున్న అంశాన్ని ఎప్పటికీ మర్చిపోలేరు. తక్కువ సమయంలో పాఠ్యాంశాన్ని ఆకట్టుకునేలా బోధించే వీలుంటుంది. మంచి ఫలితాలు వస్తాయి.

– బి.ఆదినారాయణమూర్తి, ఐఎఫ్‌పీ, బైజూస్ జిల్లా నోడల్ అధికారి, అమలాపురం

డిజిటల్ విద్య అద్భుతం



సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. డిజిటల్ టెక్నాలజీని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడం అద్భుతమైన ఆలోచనగా చెప్పవచ్చు. వీటి సాయంతో అత్యుత్తమ విద్యా బోధనకు వీలవుతుంది. శిక్షణా శిబిరాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

– సీహెచ్ ప్రసన్న, కంప్యూటర్ ఫ్యాకల్టీ, ఐఎఫ్‌పీ ట్రైనర్, వీఎస్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల, రామచంద్రపురం

దశల వారీగా అన్ని పాఠశాలల్లో..



భవిష్యత్ అంతా డిజిటల్ టెక్నాలజీ పైనే ఆధారపడి ఉంటుంది. దీనిని ఉపాధ్యాయులు అందిపుచ్చుకునేందుకు వీలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. దశల వారీగా అన్ని పాఠశాలల్లోనూ డిజిటల్ బోధనకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. విద్యా బోధనలో ఐఎఫ్‌పీలు కీలక పాత్ర పోషిస్తాయి. ఉపాధ్యాయుల శిక్షణ సమర్థంగా, సక్రమంగా కొనసాగుతోంది.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి

తొలగించిన షట్టర్లు అమర్చాలి


కలెక్టరేట్ వద్ద గోకివాడ రైతులు

కలెక్టర్‌కు గోకివాడ రైతుల వినతి

పిఠాపురం: పుట్టా కొండయ్య కాలువపై అధికారులు ఇటీవల తొలగించిన ఇనుప షట్టర్లను వెంటనే అమర్చాలని పిఠాపురం మండలం గోకివాడ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకినాడలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, పూర్వం ఇక్కడ చెక్క బల్లలుండేవని, రెండేళ్ల క్రితం ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం ఇవ్వగా ఇనుప షట్టర్లు అమర్చుకోడానికి అనుమతి ఇచ్చారని చెప్పారు. దీంతో తాము సుమారు రూ.14 లక్షల వ్యయంతో వీటిని అమర్చుకున్నామన్నారు. తద్వారా తమ గ్రామంలోని చెరువుకు నీరు పెట్టుకుని సుమారు 500 ఎకరాలు పండించుకుంటున్నామని తెలిపారు. అయితే రాపర్తి గ్రామ రైతుల మాటలు విని తాము ఏర్పాటు చేసుకున్న షట్టర్లను అధికారులు తొలగించారని, దీనివల్ల తాము పంటలు వేసే పరిస్థితి లేదని చెప్పారు. సుమారు 100 ఎకరాల్లో పంట విరామం ప్రకటిస్తున్నామని రైతులు తమ వినతి పత్రంలో పేర్కొన్నారు.

సాంకేతికతతో విప్లవాత్మక మార్పులు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడం ద్వారా ఆక్వాకల్చర్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కల్చర్ అండ్ జువాలజీ ఆధ్వర్యాన సోమవారం నేషనల్ ఫిష్ ఫార్మర్స్ డే జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ, ప్రకృతిసిద్ధమైన వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ తరాలకు భరోసా ఇవ్వడంతో పాటు మంచి ఆదాయం ఆర్జించవచ్చని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఇంటిగ్రేటెడ్ ఫిష్ ఫార్మింగ్ అధికారి, రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత జి.వెంకటరత్నం మాట్లాడుతూ, ప్రస్తుత వ్యవసాయ విధానాల వలన ప్రకృతి ఏవిధంగా నాశనమవుతుంది, ప్రజల ఆరోగ్యాలు ఏవిధంగా దెబ్బ తింటున్నాయో వివరించారు. వీటిని అధిగమించేందుకు ప్రకృతి వ్యవసాయమే సరైన విధానమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, డీన్ ఆచార్య కె.రమణేశ్వరి, హెచ్‌ఓడీ డాక్టర్ కె.ముట్టారెడ్డి, డాక్టర్ డి.కల్యాణి, అధ్యాపకులు డాక్టర్ డి.శ్రీధర్ పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య నియామకాలు


కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఒకరిని ఆఫీస్ సబార్డినేట్‌గా, ఇద్దరిని జూనియర్ సహాయకులుగా నియమించామన్నారు. కొత్తగా ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ ఏఓ జీఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

కొత్తపల్లి: ఒక యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రామలింగేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని అమరవల్లి శివారు తమ్మయ్యపేటకు చెందిన మారాడ అనంత (22) కొంత కాలం నుంచి కడుపు నొప్పితో బాధ పడుతోంది. బాధ భరించలేక ఆదివారం రాత్రి ఇంటి వద్ద ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి మారాడ సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమవారం తెలిపారు. అనంత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సారా తరలిస్తున్న వ్యక్తికి ఏడాది జైలు

కొవ్వూరు: సారా తరలిస్తూ పట్టుబడిన కేసులో ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామానికి చెందిన కర్రి శివన్నారాయణకు ఏడాది జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. రూరల్ ఎస్సై జి.సతీష్ కథనం ప్రకారం.. ఈ ఏడాది మార్చి 16న ధవళేశ్వరం నుంచి కొవ్వూరు మండలంలోని సీతంపేటకు మోటార్ సైకిల్‌పై సారా తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. వారిని చూసిన శివన్నారాయణ వాహనం వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడిని పోలీసులు పట్టుకుని 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి శివన్నారాయణకు సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.సాయికృష్ణ పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఏపీపీ డి.బాబూరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

రేపటి నుంచి రెండో సెమిస్టర్ ఫైనల్ ప్రాక్టికల్స్

రాజమహేంద్రవరం రూరల్: ప్రైవేటుగా డీఈఎల్ఈడీ, ప్రభుత్వ డైట్‌లో డీఈఎల్ఈడీ చదువుతున్న 2021–23 బ్యాచ్ విద్యార్థులకు రెండో సెమిస్టర్ ఫైనల్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ మేరకు సంబంధిత ప్రిన్సిపాల్స్ తగు ఏర్పాట్లు చేసుకోవాలని బొమ్మూరు డైట్ ప్రిన్సిపాల్ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇవే తేదీల్లో డీఈఎల్ఈడీ సప్లిమెంటరీ మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా ఫైనల్ ప్రాక్టికల్స్ నిర్వహించాలని సూచించారు. దీనికి సంబంధిత ప్రైవేటు డీఈఎల్ఈడీ ప్రిన్సిపాల్స్ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

మాణిక్యాంబ అమ్మవారికి ఆషాఢం సారె


అమ్మవారికి ఆషాఢం సారె తీసుకొచ్చిన భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా, పంచారామ క్షేత్రంగా, త్రిలింగ క్షేత్రంగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వదిగా విరాజిల్లుతున్న శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి భక్తులు సోమవారం భారీగా ఆషాఢం సారె సమర్పించారు. గ్రామానికి చెందిన చక్రి స్వీట్స్ యజమాని కంచర్ల చక్రధరరావు, వీరవేణి దంపతుల ఆధ్వర్యాన స్థానిక గీతా మందిరం నుంచి మహిళలు స్వీట్లు పట్టుకుని కాలినడకన ఆలయానికి తీసుకువచ్చారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య ఆ స్వీట్లను అమ్మవారికి సారెగా అందజేశారు. అమ్మవారి సన్నిధిలో లలితా సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో ఈఓ పితాని తారకేశ్వరరావు, మాస శివరాత్రి కమిటీ వ్యవస్థాపకుడు, శ్రీరాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, రామచంద్రపురం మండల వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు దామిశెట్టి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి శివాలయం భూమి 8 ఎకరాలు స్వాధీనం


ఆలయ భూముల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయానికి వాడపల్లిలో ఉన్న 8 ఎకరాల భూమికి కౌలు వేలం రద్దు చేశారు. ఈ భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్టు వాడపల్లి దేవస్థానం ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆ భూముల వద్ద ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది సోమవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, ప్రతి రోజూ స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల రద్దీ పెరుగుతోందని, దీనివలన వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈ 8 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కౌలుదారులు ఆ భూముల్లోకి వెళ్తితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ కోరారు.

ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు సన్మానం


కలెక్టర్ మాధవీలతను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో అత్యుత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులను సత్కరిస్తున్న ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులను కలెక్టర్ కె.మాధవీలత అభినందించారు. రాజమహేంద్రవరంలోని బ్రహ్మకుమారీస్ రాజయోగ శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు బీకే సత్యవాణి ఆధ్వర్యాన కోవిడ్‌లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను కలెక్టరేట్ స్పందన హాలులో కలెక్టర్ సమక్షంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, కరోనా విపత్కర సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆపదలో ఉన్న ప్రజలను కాపాడటంలో ఫ్రంట్‌లైన్ వర్కర్లుగా ప్రభుత్వ ఉద్యోగులు ముందున్నారని గుర్తు చేశారు. ప్రాణాపాయంలో ఉన్న ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఒక్క ప్రైవేటు ఆస్పత్రి కూడా స్వచ్ఛందంగా ముందుకు రాలేదని, ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని వైద్యులు, సిబ్బంది ముందుండి కోవిడ్ నియంత్రణకు అవిశ్రాంతంగా వైద్య సేవలందించారని అన్నారు. ఆ సేవలకు గుర్తింపుగా నేడు బ్రహ్మకుమారీస్ సంస్థ సత్కరిస్తూ, ప్రభుత్వ ఉద్యోగులపై ఉన్న గురుతర బాధ్యతలను మరింత గుర్తు చేస్తోందని చెప్పారు. భవిష్యత్తులో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఇదే స్ఫూర్తితో, నిస్వార్థ హృదయంతో ప్రజలకు సేవలు అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సత్యవాణి ఆధ్వర్యాన కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు, ఇతర జిల్లా అధికారులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకుడు వి.స్వామినాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు రామచంద్రయ్య, భాస్కర్, శివ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతే లక్ష్యంగా వాకథాన్

- కంబాలచెరువు నుంచి పుష్కర ఘాట్ వరకూ నిర్వహణ
- ప్రారంభించిన ఓఎన్‌జీసీ ఈడీ అమిత్ నారాయణ్


జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఈడీ అమిత్ నారాయణ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్వచ్ఛత పఖ్వాడా–2023 ప్రచారంలో భాగంగా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పరిశుభ్రత, సుస్థిరత వైపు ప్రజలను సమీకరించే ప్రయత్నాలకు కొనసాగింపుగా వాకథాన్ నిర్వహించినట్లు ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. కంబాలచెరువు నుంచి పుష్కర ఘాట్ వరకూ సోమవారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఓఎన్‌జీసీ ఉద్యోగులు, కలెక్టివ్‌లు, కుటుంబ సభ్యులు, కేంద్రీయ విద్యాలయ, నన్నయ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు, క్యాడెట్‌లతో కలిసి దాదాపు 500 మంది ఉద్యోగులు ఈ వాకథాన్‌లో పాల్గొన్నారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు పుష్కర్ ఘాట్ వద్ద 'నుక్కడ్' నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా అమిత్ నారాయణ్ మాట్లాడుతూ, పుష్కర్ ఘాట్, మార్కేండేయేశ్వర స్వామి ఆలయం ఘాట్ వద్ద గత వారం పరిశుభ్రత డ్రైవ్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఘన వ్యర్థాలతో ఉత్పన్నమయ్యే సమస్యలు, పర్యావరణంపై వాటి ప్రభావంపై ఉద్యోగులు, విద్యార్థులు, స్థానికులకు అవగాహన కల్పించేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగం ద్వారా ఓఎన్‌జీసీ ఎప్పుడూ చొరవ తీసుకుంటోందని చెప్పారు. ఈ సంవత్సరం, 'క్లీన్, హెల్తీ అండ్ ప్రోస్పెరస్ ఇండియా' అనే థీమ్‌తో స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారంతో వివిధ కార్యక్రమాలు ప్రారంభించామని తెలిపారు. స్వచ్ఛత పఖ్వాడా ప్రచారంలో భాగంగా చెత్త వేసే క్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఘన వ్యర్థాలపై నగర ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఓఎన్‌జీసీ కట్టుబడి ఉందని అన్నారు. ప్లాస్టిక్ బ్యాగులకు బదులు గుడ్డ సంచులు వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'స్వచ్ఛత పఖ్వాడా–2023' ప్రచార పక్షం ఈ నెల 15వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా వ్యర్థాలను వేరు చేయడం, నగరంలో కార్యాచరణ సిద్ధం చేసిన ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్, వర్క్‌షాప్ సహా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి, చెత్త, పరిశుభ్రతపై విద్యార్థులను చైతన్యపరచడానికి ఈ వారం క్విజ్, పోస్టర్ తయారీ, వ్యర్థాల ముప్పుపై నినాదాల పోటీ నిర్వహిస్తామని అమిత్ నారాయణ్ తెలిపారు.